

మహానందిలో వీకెండ్ సందడి

మహానంది: క్షేత్రంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వివిధ ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు స్థానిక కోనేర్లలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకున్నారు.



మల్లన్నకు నృత్యనీరాజనం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిత్యకళావేదికపై నెల్లూరుకు చెందిన పి.విద్య, బృందం వారు ప్రదర్శించిన కూచిపూడి నృత్యప్రదర్శన ఆకట్టుకుంది. పలు భక్తి గీతాలకు నృత్యం ప్రదర్శించారు.



వీనుల విందుగా..

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా నిత్య కళా వేదికంపై శనివారం గుంటూరుకు చెందిన పావులూరి హరినాథ్ బాబు వారు నిర్వహించిన భజన కార్యక్రమం అలరించింది.

న్యూస్‌రీల్

27 దరఖాస్తుల తిరస్కరణ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి డాక్యుమెంటేషన్ సరిగా లేనందున ప్రచార అనుమతుల కోసం వచ్చిన వాటిలో 27 దరఖాస్తులను తిరస్కరించినట్లు నోడల్ అధికారి పీఎల్ వరలక్ష్మి శనివారం విలేకరులకు తెలిపారు. ఇప్పటి వరకు అనుమతుల కోసం 54 దరఖాస్తులు వచ్చాయని పేర్కొన్నారు. వాటిలో ఇందులో 27 దరఖాస్తులకు అనుమతులు ఇచ్చినట్లు ఆమె తెలిపారు. పబ్లిక్ మీటింగ్‌లు, ఇంటింటి ప్రచారం, ర్యాలీలు,కరపత్రాల పంపిణీ, హోర్డింగ్‌ల ఏర్పాటు..ఇలా 20 రకాల కార్యక్రమాలకు ముందస్తు అనుమతులు తప్పనిసరని ఆమె పేర్కొన్నారు.

రేపటి వరకే ఓటు నమోదుకు అవకాశం

కర్నూలు(సెంట్రల్): వచ్చే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కును నమోదు చేసుకోవడానికి రేపటి (15వ తేదీ) వరకే అవకాశం ఉందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు ఓటరు జాబితాలో పేరు లేని వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 2006 మార్చి 31వ తేదీలోపు పుట్టిన వారందరూ ఓటు నమోదుకు అర్హులని, ఇప్పటికే 18 ఏళ్లు నిండినా ఓటు హక్కులేని వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

పకడ్బందీగా 'ఫ్యామిలీ ఫిజీషియన్'

కల్లూరు: జిల్లాలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శనివారం కల్లూరు మండలం బొల్లవరం గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవం సురక్షితమని పేర్కొన్నారు. కల్లూరు పీహెచ్‌సీ వైద్యులు మోతీలాల్ నాయక్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పదోన్నతుల కల నెరవేర్చి.. పాలన చేరువ చేసి!

పల్లె ప్రజలకు విస్తృత సేవలు అందిస్తున్న పంచాయతీరాజ్ విభాగాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పటిష్టం చేసింది. ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చింది. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల ప్రక్రియను చేపట్టి.. ఎంపీడీఓల కలను సాకారం చేసింది. కింది స్థాయి ఉద్యోగులకు సైతం అర్హత ప్రకారం పదోన్నతులు కల్పించింది. సూపరింటెండెంట్లను పరిపాలనా అధికారులుగా గుర్తించి వారికి గెజిటెడ్ హోదా ఇచ్చింది. గ్రామగ్రామానా ఏర్పాటు చేసిన సచివాలయాలతో పరిపాలన చేరువకాగా.. అందులో పనిచేసే ఉద్యోగులకు పేస్కేల్ అమలు చేయడంతో అంతటా హర్షం వ్యక్తమవుతోంది.



- పంచాయతీ రాజ్ విభాగంలో వినూత్న మార్పులు తీసుకొచ్చిన ప్రభుత్వం
- ఆర్‌డీఓల తరహాలో డీఎల్‌డీఓ పోస్టులు
- నెరవేరిన ఎంపీడీఓల స్వప్నం
- జిల్లా అధికారులుగా పదోన్నతి
- పర్యవేక్షకులను ఏఓలుగా గుర్తించి గెజిటెడ్ హోదా
- సచివాలయ ఉద్యోగులకు పేస్కేల్ అమలు



దేశానికే తలమానికంగా సచివాలయ వ్యవస్థ

పాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో చేపట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే తలమానికంగా మారింది. ఈ వ్యవస్థను పంచాయతీరాజ్ శాఖ పరిధిలోకి తీసుకురావడం వల్ల పాలన మరింత సులభమైంది. ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలన్ని గ్రామ, వార్డు సచివాలయాల ద్వారానే ప్రజలకు చేరవేస్తున్నారు. ఈ పర్యవేక్షణ బాధ్యతలన్నీ ఎంపీడీఓలకు అప్పగించారు. పంచాయతీరాజ్ శాఖపై రాష్ట్ర ప్రభుత్వం మరింత శ్రద్ధ కనబరుస్తోందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

కర్నూలు(అర్బన్): ఉద్యోగులతో పనిచేయించుకోవడమే కాదు.. వారికి కావాల్సిన సదుపాయాలు కల్పించడం.. వారి సమస్యలు పరిష్కరించడంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంది. సమాజంలో ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు హుందాగా, ఉన్నతంగా బతికేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో వందల సంఖ్యలో ఉద్యోగుల కలలు నెరవేరాయి. ఈ శాఖలో ఉద్యోగంలో చేరినప్పటి నుంచి పదవీ విరమణ అయ్యేంతవరకు గతంలో ఎంపీడీఓలకు ఎలాంటి పదోన్నతులు ఉండేవి కాదు. 2022 ఆగస్టులో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో జిల్లాలో 17 మంది ఎంపీడీఓలు పదోన్నతులు పొందారు. వారికి వివిధ ప్రభుత్వ శాఖల్లో జిల్లా అధికారులుగా పనిచేసే అవకాశం లభించింది. తమ పదోన్నతుల కోసం వీరు దాదాపు రెండున్నర దశాబ్దాలుగా అనేక రూపాల్లో పోరాటం చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారినా వీరి కల నెరవేరలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరమే వీరికి పదోన్నతులు లభించాయి. అంతే కాకుండా రెవెన్యూ శాఖలో ఉన్న విధంగానే పంచాయతీరాజ్ శాఖలో కూడా డివిజన్ స్థాయిలో డీఎల్‌డీఓ పోస్టును రాష్ట్రప్రభుత్వం సృష్టించింది. అర్హులైన వారికి డీఎల్‌డీఓగా పదోన్నతులు ఇచ్చింది. ఎంపీడీఓలకు పదోన్నతులు ప్రారంభం కాగానే క్షేత్ర స్థాయి (ఆఫీస్ సబార్డినేట్) నుంచి పదోన్నతుల ప్రక్రియ ఊపందుకుంది. అర్హత కలిగిన ఎంపీడీఓలు జిల్లా స్థాయి అధికారులుగా పదోన్నతిపై వెళ్లగా, వారి స్థానంలో 14 మంది ఏఓ, 13 మంది ఈఓఆర్‌డీలకు 2023 మే నెలలో ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పించారు. వీరి స్థానంలో తొమ్మిది మంది సీనియర్ అసిస్టెంట్లు, 15 మంది గ్రేడ్–1 పంచాయతీ కార్యదర్శులకు ఈఓఆర్‌డీలుగా పదోన్నతులు లభించాయి. పదోన్నతుల ప్రక్రియ నేపథ్యంలోనే సీనియర్, జూనియర్ సహాయకులు, టైపిస్టులు, రికార్డు అసిస్టెంట్లకు వారి వారి అర్హతలను బట్టి పదోన్నతులు లభించాయి. మొత్తం మీద రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో వందల సంఖ్యలో ఉద్యోగుల పదోన్నతుల కల సాకారమైంది.

గెజిటెడ్ హోదా

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించిన వివిధ (ఎంపీడీఓ, జెడ్పీ, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్) కార్యాలయాల్లో పర్యవేక్షకులుగా (సూపరింటెండెంట్‌లుగా) పనిచేస్తున్న వారికి తగిన గుర్తింపు లభించింది. వీరిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పరిపాలనాధికారులుగా (ఏఓ)లుగా గుర్తించింది. అంతే కాకుండా వారికి గెజిటెడ్ హోదాను ఇచ్చింది. దీంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా అధికారులుగా..

రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యలతో ఎంపీడీఓల హోదా పెరిగింది. పదోన్నతులు లభించడంతో వీరు వివిధ ప్రభుత్వ శాఖల్లో జిల్లా అధికారులు అయ్యారు. పరిషత్ సీఈఓగా, డిప్యూటీ సీఈఓగా, జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేసే అవకాశం కొందరికి లభించింది. డ్వామా, డీఆర్‌డీఏ, మెప్మా, హౌసింగ్ శాఖల్లో పీడీలుగా కొందరు వెళ్లారు. పలు శాఖల్లోని కీలకమైన పోస్టుల్లోనూ వీరు పనిచేస్తున్నారు. ఎన్నో ఏళ్ల కల నెరవేరడం..హోదా పెరగడంతో తమ కష్టాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గుర్తించిందని ఎంపీడీఓలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సచివాలయ ఉద్యోగులకు పేస్కేల్ అమలు

జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల ప్రొబేషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం 2022 జూన్ నెలలో డిక్లేర్ చేసింది. ఈ నేపథ్యంలోనే రెండేళ్ల సర్వీసును పూర్తి చేసుకొని, డిపార్ట్‌మెంటల్ టెస్ట్ ఉత్తీర్ణులైన సచివాలయ ఉద్యోగుల ప్రొబేషన్‌ను డిక్లేర్ చేశారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో మొత్తం 1188 గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా, వీటిలో కర్నూలు జిల్లాలో 465 గ్రామ సచివాలయాలు, 207 వార్డు సచివాలయాలు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో 420 గ్రామ సచివాలయాలు, 96 వార్డు సనివాలయాలు ఉన్నాయి. ఈ సచివాలయాల్లో మొత్తం మంజూరైన పోస్టులు 9,878 ఉండగా, 8,630 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరిలో రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకోవడంతో పాటు డిపార్టుమెంటల్ టెస్ట్ పాస్ అయిన 7,466 మంది ఉద్యోగుల ప్రొబేషన్ ముందుగా డిక్లేర్ కాగా, మిగిలిన వారికి విడతల వారీగా డిక్లేర్ చేశారు. ప్రొబేషన్ డిక్లేర్ కావడంతో పే స్కేల్‌ను కూడా అమలు చేశారు. దీంతో సచివాలయ ఉద్యోగుల జీతాలు కూడా పెరిగాయి. ఉద్యోగంలో చేరిన సమయంలో వారి నెల జీతం రూ.15 వేలు ఉండగా, ప్రస్తుతం గ్రాస్‌గా ప్రతి సచివాలయ ఉద్యోగి నెలకు రూ.30 వేల వరకు తీసుకుంటున్నారు. అలాగే గ్రేడ్ –5 పంచాయతీ కార్యదర్శులు నెలకు రూ.32 వేల వరకు డ్రా చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

- పార్టీ జిల్లా అధ్యక్షురాలు సి. సత్యనారాయణమ్మ



ఆలూరులో మాదాసి, మాదారి కురుబ సంఘం నాయకులతో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు సి.సత్యనారాయణమ్మ

ఆలూరు: జిల్లాలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని మాదాసి, మాదారి కురుబ కులస్తులను ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు సి. సత్యనారాయణమ్మ కోరారు. ఆలూరు, హాలహర్వి, గూళ్యం, ఆస్పరి మండలం కైరుప్పల, ములుగుందం తదితర గ్రామాల్లోని మాదాసి, మాదారి కురుబ కులస్తులతో శనివారం ఆమె ఆలూరులో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కురుబ కులస్తులను టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన, బీజేపీ నేతలు గుర్తించలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కురుబ కులానికి చెందిన తనను జిల్లా అధ్యక్షురాలిని చేశారని, పదవుల్లో మహిళలకు ప్రాధాన్యత ఇచ్చారన్నారు. అర్హతే ప్రామాణికంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినే విరూపాక్షిని గెలిపించాలన్నారు. ఆలూరులోని ఎల్లార్తి రోడ్డు సమీపంలో భక్త కనకదాస్ మండలి వారు ఆమెకు సన్మానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో గడ్డం నాగరాజు, రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుడిసె శివన్న, మద్దిలేటి, శేషప్ప, హాలహర్వి మాజీ ఎంపీపీ కురుబ బసప్ప, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ బజారప్ప, నాయకులు వెంకటేష్, వీరేష్, ఎమ్మార్పీఎస్ నాయకుడు ఎల్లప్ప పాల్గొన్నారు.

రూపుదిద్దుకున్న కొత్త చెరువులు



ఓర్వకల్లు మండలం శకునాలలో నిర్మించిన నూతన చెరువు

- కర్నూలు జిల్లాలో 9, నంద్యాల జిల్లాలో మూడు నూతన చెరువులు
- వీటి నిర్మాణ వ్యయం రూ.కోటి
- 10 వేల క్యూబిక్ మీటర్ల సామర్థ్యంతో నిర్మాణం
- కొత్త చెరువుల్లో 12 కోట్ల లీటర్ల నీటి నిల్వ
- సాగు, తాగు నీటి సమస్యలకు పరిష్కారం
- భూగర్భ జలాలు మరింత పెరిగే అవకాశం



దోన్ మండలం ఎద్దుపెంటలో కొత్తగా నిర్మించిన చెరువు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొత్త చెరువులు రూపుదిద్దుకున్నాయి. డబ్ల్యూడీసీ ప్రధానమంత్రి క్రిషి సంచాయ్ యోజన (పీఎంకేఎస్వై) 2.0 కింద రూ.కోటితో జిల్లా నీటియాజమాన్య సంస్థ వీటిని నిర్మించింది. వర్షాలు పడితే కొత్త చెరువులు జలకళను సంతరించుకునే అవకాశం ఉంది. అలాగే చుట్టుపక్కల పొలాల్లో భూగర్భ జలాలు పెరగనున్నాయి. పశువులు, ఇతర మూగజీవులకు తాగునీరు అందుబాటులోకి రానుంది. పీఎంకేఎస్వై కింద కర్నూలు జిల్లాలో 5, నంద్యాల జిల్లాలో 7 ప్రాజెక్టుకు రూ.70 కోట్లతో చేపట్టారు. కర్నూలు జిల్లాలో హాలహర్వి, ఎమ్మిగనూరు మండలం కందనాతి, ఆదోని మండలం పెద్ద హరివాణం, కృష్ణగిరి మండలం పోతుగల్, ఓర్వకల్ మండలం శకునాల గ్రామాల్లో వాటర్‌షెడ్ ప్రాజెక్టులు జరుగుతున్నాయి. నంద్యాల జిల్లాలో సంజామల మండలం ఆకుమల్ల, డోన్ మండలం ఎద్దుపెంట గ్రామాల్లో వాటర్‌షెడ్ ప్రాజెక్టులు నిర్వహిస్తున్నారు. వీటి పరిధిల్లోనే నూతన చెరువులు ఆవిర్భవించాయి.

సామర్థ్యం 12 కోట్ల లీటర్లు

కొన్ని గ్రామాల్లో ప్రభుత్వ భూములు, మరికొన్ని గ్రామాల్లో ప్రయివేటు భూముల్లో కొత్త చెరువుల నిర్మాణం చేపట్టారు. ఓర్వకల్లు మండలం శకునాల, కాల్వ గ్రామాల్లో, కృష్ణగిరి మండలం పోతుగల్‌లో రెండు, ఎమ్మిగనూరు మండలం కందనాతి గ్రామంలో రెండు, హాలహర్వి మండలం బాపురం గ్రామంలో రెండు, హాలహర్విలో ఒకటి ప్రకారం మొత్తం తొమ్మిది కొత్త చెరువులను నిర్మించారు. నంద్యాల జిల్లా డోన్ మండలం ఉంగరానిగుంట్లలో రెండు, ఎద్దులదొడ్డి గ్రామంలో ఒకటి ప్రకారం మొత్తం మూడు పూర్తి చేశారు. వాటర్‌షెడ్ కార్యక్రమాల్లో భాగంగా నిర్మిస్తున్న కొత్త చెరువులను అమృత్ సరోవర్‌లుగా అభివృద్ధి చేస్తున్నారు. కర్నూలు జిల్లాలో 9 కోట్ల లీటర్లు, నంద్యాల జిల్లాలో 3 కోట్ల లీటర్లు మొత్తంగా 12 కోట్ల లీటర్ల సామర్థ్యంతో కొత్త చెరువు నిర్మించారు. చెరువు నిండిన తర్వాత నీళ్లు బయటికి వెళ్లిపోయేందుకు మరువ కూడా ఏర్పాటు చేశారు.

భూగర్భ జలాలు పెరిగే అవకాశం

అజాదీకా అమృత్ మహోత్సవ్ కింద 2022 నుంచి ప్రతి జిల్లాలో 80 చెరువుల వరకు అమృత్ సరోవర్లుగా అభివృద్ధి చేశారు. ఇదే కార్యక్రమం నూతన చెరువుల నిర్మాణం కూడా జరిగింది. మామూలుగా అయితే కొత్త చెరువుల నిర్మాణం అంటే భారీ ఖర్చుతో కూడుకున్న పని. అయితే ఉమ్మడి జిల్లాలో 12 చెరువులను నెలకొల్పినప్పటికి ఖర్చు చేసింది.. రూ.కోటి వరకు మాత్రమే. కొత్త చెరువుల నిర్మాణం ద్వారా ఒక్కో చెరువు కింద దాదాపు 100 బావులు, బోర్లలో భూగర్భ జలాలు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. దీంతో ఆయకట్టు సాగు కూడా పెరుగనుంది. రానున్న రోజుల్లో సాగు, తాగు నీటికి ఇబ్బందులు తీరనున్నాయి.

గుమ్మనూరుకు దోచుకోవడమే తెలుసు





సభకు హాజరైన జనం, మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, చిత్రంలో ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి తదితరులు

- మంత్రి పదవి ఇచ్చినా అభివృద్ధి చేయలేకపోయారు
- చంద్రబాబును ప్రజలు నమ్మే స్థితిలో లేరు
- వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, విరూపాక్షి
- ములుగుందంలో టీడీపీ నుంచి 500 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకుడు బొబ్బిలి మనోహర్‌రెడ్డి, చిత్రంలో విరూపాక్షి, బీవై రామయ్య తదితరులు

ఆస్పరి: మాజీ మంత్రి గుమ్మనూరు జయరాం, అతని సోదరులు దోచుకోవడం, దాచుకోవడం తప్ప ప్రజలకు చేసేందేమి లేదని వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షి, నియోజకవర్గ పరిశీలకుడు తెర్నేకల్లు సురేంద్రరెడ్డి విమర్శించారు. గుమ్మనూరుకు మంత్రి పదవి ఇచ్చినా సొంత నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోలేకపోయారన్నారు. ఎంతో ప్రాధాన్యత ఇచ్చిన వైఎస్సార్‌సీపీకి వెన్నుపోటు పొడిచిన జయరాంను, అతని సోదరులను ప్రజలు ఛీదరించుకుంటున్నారన్నారు. శనివారం ఆస్పరి మండలంలోని ములుగుందం, పలకూరబండ గ్రామాలకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు బొబ్బిలి మనోహర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు బొబ్బిలి వీణారెడ్డి, సర్పంచ్ శ్యామలమ్మతో పాటు బొబ్బిలి వెంకటరెడ్డి, యేసోబు, ఉరుకుందు రెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డి, తమ్మిరెడ్డి, ఖాసీంసాబ్, నబిసాబ్, పెద్దరామన్న, దేవేంద్ర, చెన్నయ్య, ఉసేని సహా 500 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి బీవై రామయ్య, విరూపాక్షి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో వారు మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఉత్తుత్తి హామీలు ఇచ్చి ఓటర్లను మభ్యపెట్టడం టీడీపీ అధినేత చంద్రబాబుకు అలవాటేనన్నారు. 2014లో రైతులు, పొదుపు మహిళల రుణాలు మాఫీ చేస్తానని చెప్పి మోసం చేశారన్నారు. ఇప్పుడు సూపర్ సిక్స్ అంటూ ఉత్తుత్తి హామీలతో ప్రజలను మరోసారి మోసం చేయడానికి వస్తున్నారని.. ప్రజలు చంద్రబాబును నమ్మే స్థితిలో లేరన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వంద శాతం అమలు చేసి చూపించారన్నారు. అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. జగనన్న చెప్పాడంటే చేస్తాడనే నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. ఈ ఎన్నికలతో టీడీపీ కనుమరుగవుతుందని జోస్యం చెప్పారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆస్పరి, దేవనకొండ జెడ్పీటీసీ సభ్యులు దొరబాబు, కిట్టు, నాయకులు సొమ్మ రెడ్డి, శశికళ, వైకుంఠం మల్లికార్జున చౌదరి, కృష్ణ మోహన్, పెద్దయ్య, మూలింటి రాఘవేంద్ర, కట్టెల గోవర్ధన్, బసవరాజు, మారయ్య, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, దత్తాత్రేయరెడ్డి, కేశవరెడ్డి, చిన్నాయప్ప, సుంకర రామాంజనేయులు, రాజశేఖర్, బాలన్న, తిక్కయ్య, ఉసేన్‌పీరా పాల్గొన్నారు.



నందవరం చౌడేశ్వరి దేవి బ్రహ్మోత్సవ సంబరాలు అంబరాన్ని తాకాయి. శుక్రవారం అర్ధరాత్రి ప్రారంభమైన జ్యోతి మహోత్సవానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. తొగట వీర క్షత్రియులు భక్తిశ్రద్ధలతో నెత్తిన జ్యోతులు పెట్టుకుని ప్రదర్శనగా తరలివచ్చి అమ్మవారికి సమర్పించారు.

- వివరాలు 8లో

నేడు, రేపు ఉద్యోగులకు వైద్య పరీక్షలు

కర్నూలు(అగ్రికల్చర్): అనారోగ్య కారణాలతో ఎన్నికల విధుల నుంచి మినహాయింపు కోరుతున్న ఉద్యోగులకు ఈ నెల 14, 15 తేదీల్లో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా ట్రెజరీ అధికారి రామచంద్రరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదట మార్చి15, 16 తేదీల్లో మెడికల్ స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించగా.. పలువురు హాజరు కాలేదని పేర్కొన్నారు. తర్వాత మరికొందరు దరఖాస్తు చేసుకోవడంతో మరోసారి మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారని ఆయన తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సీ.క్యాంపులోని హెల్త్ డిస్పెన్సరీలో స్క్రీనింగ్ టెస్టులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల విధుల నుంచి మినహాయింపు కోరుతూ దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు విధిగా స్క్రీనింగ్ టెస్ట్‌కు హాజరు కావాలని ఆయన కోరారు.

ఓటెత్తుదాం..



మన ఓటు.. మన గౌరవం నినాదంతో కర్నూలు కలెక్టరేట్ వద్ద ఈవీఎం రూపంలో ఏర్పాటు చేసిన బెలూన్ ఆకట్టుకుంటోంది. పక్కనే ఉన్న ఫ్లెక్సీపై పలువురు సంతకాలు చేస్తూ.. ఓటు వినియోగంపై సందేశాలు రాస్తున్నారు.

-సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు

క్లుప్తంగా

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య


మృతుడు గొల్ల మోహన్ (ఫైల్)

దేవనకొండ: కుటుంబ కలహాలతో మనస్తాపం చెందిన ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. కె. వెంకటాపురంలో ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కె.వెంకటాపురం గ్రామానికి చెందిన గొల్ల మోహన్ (27)కు దేవనకొండ మండలంలోని కొత్తపేటకు చెందిన సుజాతతో ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మోహన్ హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు కంపెనీలో పని చేస్తుండటంతో కుటుంబంతో అక్కడే ఉన్నాడు. కాగా కుటుంబ కలహాలతో దంపతులు ఈనెల 7వ తేదీన గొడవ పడ్డారు. దీంతో సుజాత తన పుట్టిన ఊరు కొత్తపేటకు, మోహన్ తన సొంతూరు కె.వెంకటాపురానికి చేరుకున్నారు. కాగా భార్యను కాపురానికి తీసుకొచ్చేందుకు ఈనెల 12వ తేదీన మోహన్ కొత్తపేట వెళ్లాడు. ఆ సమయంలో వారి మధ్య మళ్లీ గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన మోహన్ కొత్తపేటలోనే పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడిపోగా, గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ కోలుకోలేక శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి తండ్రి తిప్పయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు దేవనకొండ సీఐ శ్రీనివాసులు తెలిపారు.

మద్యం దుకాణంలో చోరీకి యత్నం

కర్నూలు: కర్నూలు కొత్తబస్టాండ్ సమీపంలోని కరెంట్ ఆఫీస్‌కు ఎదురుగా ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీకి దొంగలు యత్నించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రభు త్వం నిర్దేశించిన ప్రకారం మద్యం దుకాణాలను ప్రతిరోజూ రాత్రి 9 గంటలకు బంద్ చేస్తారు. ఉగాది పర్వదినం రోజు కూడా కరెంట్ ఆఫీస్‌కు ఎదురుగా ఉన్న మద్యం దుకాణం నిర్వాహకులు రాత్రి 9 గంటలకు బంద్ చేసి వెళ్లిపోయారు. దుకాణం సమీపంలోనే వాచ్‌మెన్ పడుకున్నాడు. అర్ధరాత్రి వేళ ఇద్దరు యువకులు గ్యాస్ కట్టర్లతో వచ్చి దుకాణానికి ఉన్న గ్రిల్‌ను తొలగించే ప్రయత్నం చేస్తుండగా శబ్దాన్ని విని వాచ్‌మెన్ గట్టిగా కేకలు వేయడంతో దుండగులు వారు తెచ్చుకున్న సామాన్లు అక్కడే వదిలి పరారయ్యారు. వాచ్‌మెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాల్గవ పట్టణ పోలీసులు సంఘటనపై రహస్యంగా విచారణ జరుపుతున్నారు. చోరీకి వచ్చినవారు గ్యాస్ కట్టర్ వినియోగించడంతో పాత నేరస్తులే చోరీకి యత్నించి ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. సమీపంలోని సీసీ కెమెరాల ఫుటేజీని కూడా సేకరించారు. అదే రోజు ఓర్వకల్లు మండలం హుసేనాపురం గ్రామంలో ఉన్న ఏటీఎంలో కూడా చోరీ జరిగింది. దొంగలు గ్యాస్ కట్టర్‌ను ఉపయోగించినట్లు తేలడంతో అంతర్‌రాష్ట్ర దొంగలేమైనా జిల్లాలోకి ప్రవేశించారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జ్యోతి మహోత్సవం .. భక్తి పారవశ్యం


ఆలయంలో కొలువైన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారు

- ఈ ఏడాది అత్యధికంగా 642 జ్యోతుల సమర్పణ
- అబ్బురపరిచిన తొగటవీర క్షత్రియుల కత్తి సాము ప్రదర్శన
- భక్తులతో కిటకిటలాడిన చౌడేశ్వరిదేవి ఆలయం


తొగట వీరక్షత్రియ భక్తుల కత్తి సాము ప్రదర్శన


అమ్మవారి ఆలయం వద్దకు తరలుతున్న జ్యోతులు


జ్యోతితో అగ్నిగుండంలో నడిచి వెళ్తున్న భక్తుడు

బనగానపల్లెరూరల్: నందవరంలో వెలసిన చౌడేశ్వరి దేవి బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రాధాన్యత ఉండే జ్యోతి మహోత్సవం కనుల పండువగా సాగింది. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్ధరాత్రి శ్రీభాస్కరయ్య ఆచారిచే అమ్మవారికి దిష్టి చుక్క పెట్టు కార్యక్రమాన్ని ఆలయ సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. అనంతరం గ్రామంలోని శ్రీ చెన్నకేశస్వామి దేవస్థానం నుంచి ఆయా ప్రాంతాల తొగట వీర క్షత్రీయులు, అమ్మవారి భక్తులు జ్యోతులతో బయలుదేరారు. గోధుమ పిండి, నెయ్యి, బెల్లం తదితర ప్రత్యేక ప్రదార్థాలతో తయారు చేసిన పిండితో తయారు చేసిన జ్యోతిని వెలిగించుకుని భక్తులు తలపై పెట్టుకొని అమ్మవారి శ్రీ చౌడేశ్వరిదేవి భక్తి గీతాలు పాడుకుంటూ మేళతాళలతో ఊరేగింపుగా బయల్దేరారు. మొదట సర్కార్ వారి జ్యోతిని భక్తులు తీసుకోస్తుండగా ఈ జ్యోతి వెంట మిగిలిన జ్యోతులు ర్యాలీగా గ్రామ చావిడి, బస్టాండ్ మీదుగా శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారి ఆలయం వద్దకు వచ్చారు. దేవస్థానం ముందు ఏర్పాటు చేసిన అగ్ని గుండం మీదుగా జ్యోతులతో వచ్చి భక్తులు నడుచుకుంటూ వచ్చి ఆలయ గర్భగుడిలో కొలువైన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. జ్యోతి మహోత్సవంలో తొగటవీర క్షత్రియులు ప్రదర్శించిన కత్తి సాము ప్రదర్శన అబ్బురపరిచింది. సర్కార్ వారి జ్యోతి వద్ద భక్తుల రద్దీని నివారించేందుకు డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, బనగానపల్లె సీఐ గంటా సుబ్బారావు, ఎస్ఐ తిరుపాల్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది సుమారు 642 జ్యోతులు అమ్మవారికి సమర్పించారు. బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సతీమణి కాటసాని జయమ్మ అమ్మవారికి జ్యోతిని సమర్పించి మొక్కులు చెల్లించారు. శనివారం సాయంత్రం శ్రీ చౌడేశ్వరిదేవి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ముస్తాబు చేసి, రథోత్సవ కార్యక్రమం గ్రామ ముఖద్వారం వరకు భక్తుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమం భక్తులు గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

కొండ ముచ్చులు నల్లమలకు తరలింపు


కొండముచ్చులను బంధించిన దృశ్యం

డోన్ టౌన్: వారం రోజులుగా పట్టణ ప్రజలపై దాడి చేస్తూ ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్న కొండ ముచ్చులను శనివారం అటవీ అధికారులు బంధించి నల్లమలకు తరలించారు. సబ్ డివిజనల్ ఫారెస్టు అధికారి సూర్యచంద్ర రాజు తెలిపిన వివరాల మేరకు.. కొండముచ్చు కోతులు పట్టణంలో ప్రజలపై దాడి చేసి గాయపరుస్తుండటంతో జిల్లా ఫారెస్టు అధికారి శివ శంకర్‌రెడ్డి దృష్టికి వెళ్లింది. ఆయన ఆదేశాల మేరకు శ్రీశైలం వైల్డ్‌లైఫ్ డాక్టర్లు అరన్ వెస్లీ, జుబేర్‌లు డోన్‌కు చేరుకుని వాటి సంచారంపై నిఘా పెట్టారు. ఈ మేరకు శనివారం ఉదయం రెండు గుంపులకు చెందిన వాటిలో రెండు మగ కొండ ముచ్చులకు మత్తు ఇంజెక్షన్లు ఇచ్చి బంధించారు. అనంతరం వాటికి చికిత్సలు చేసి సురక్షితంగా బోనులో ఉంచి ఆత్మకూరు నల్లమల అటవీ ప్రాంతానికి తరలించారు. డోన్ ఫారెస్టు అధికారి ప్రవీణ్ కుమార్, డిప్యూటీ రేంజర్ శివశంకర్, బీట్ ఆఫీసర్లు విష్ణువర్ధన్, ఎస్‌టీఆర్ తదితరులు శ్రీశైలం డాక్టర్లకు సహకరించారు.

మహానంది కోనేరు నీటిపై పరిశోధనలు

- కోనేటి నీటిలో తొమ్మిది రకాల మినరల్స్
- కోనేరు, నీటి సంపదకు దేశవ్యాప్తంగా గుర్తింపునకు ప్రణాళికలు
- పరిశోధనా పత్రాలను అందించిన ఇంటాచ్ సంస్థ


ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డికి పరిశోధనా పత్రాలను అందిస్తున్న ఇంటాచ్ సంస్థ కన్వీనర్


మహానందిలోని రుద్రగుండం కోనేరు

మహానంది: మహానంది అనగానే ముందుగా అందరికీ గుర్తొచ్చేది కోనేరులు. అందులోని స్వచ్ఛమైన జలసంపద. ఈ నీటిపై ప్రముఖ పరిశోధనా సంస్థ ఇంటాచ్ పరిశోధనలు ప్రారంభించింది. ఈ మేరకు శనివారం పరిశోధనా పత్రాలను మహానంది ఆలయ ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ప్రధానార్చకులు మామిళ్లపల్లి అర్జునశర్మలకు అందించారు. ఈ మేరకు పరిశోధనల్లో పలు ఆసక్తికర విషయాలు వెలుగులోకి వచ్చినట్లు ఇంటాచ్ సంస్థ నంద్యాల జిల్లా కన్వీనర్ ఎంవీ శివకుమార్‌రెడ్డి తెలిపారు. రుద్రగుండం (పెద్దకోనేరు), రెండు చిన్నకోనేర్లు బ్రహ్మగుండం, విష్ణుగుండం కోనేరుల చుట్టు కొలత, పొడవు, వెడల్పు అంశాలపై నివేదికలు తయారు చేశారు.

సహజంగానే పీహెచ్ స్థాయి 7.1

బోరుబావుల్లో లభించే నీటిని అధునాతనమైన మిషన్లు, వివిధ రకాల కెమికల్స్ వేసి ఫిల్టర్ చేస్తే కానీ నీటిలో సాధారణ పీహెచ్ స్థాయి రాదని కన్వీనర్ ఎంవీ శివకుమార్‌రెడ్డి తెలిపారు. అయితే మహానందీశ్వరుడి చెంత సహజంగా ప్రవహించే నీటిలో పీహెచ్ 7.1 స్థాయి ఉండటం విశేషమన్నారు. భూగర్భ జల వనరుల శాఖ, ఉపరితల జలసంరక్షణ, తెలుగుగంగ ప్రాజెక్ట్ అధికారుల చేత పరిశోధనలు చేయించామన్నారు. ఈ మేరకు కోనేరులు, వాటి చుట్టు కొలత, నీటి స్థాయి, తగ్గకుండా ప్రవహించడం, నీటిలో ఉన్న మినరల్స్, తదితర అంశాలపై పరిశోధనల ఫలితాలు వచ్చాయని చెప్పారు. క్యాల్షియం కార్బోనేట్, కాల్షియం, క్లోరైడ్, సల్ఫేట్, మెగ్నీషియం, హైడ్రోకార్బోనేట్, సోడియం తదితర మినరల్స్ ఉన్నాయన్నారు. మహానంది కోనేరులోని నీరు గుండు సూది వేసినా స్వచ్ఛంగా ఉండటానికి కారణం అందులోని మినరల్స్ అని చెప్పారు. మహానంది కోనేరులో ఏడాది పొడవునా తగ్గకుండా ప్రవహించే కోనేరులు, నీటి పరిశోధనా పత్రాలను రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలకు సమర్పించి దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని ఎంవీ శివకమార్ 'సాక్షి'తో తెలిపారు. అహోబిలంలో ప్రతి ఏటా జరిగే పార్వేట ఉత్సవాన్ని ప్రభుత్వ పండుగగా గుర్తింపు తీసుకురావడానికి ఇంటాచ్ సంస్థ కృషి చేసిందని, మహానందిలో జరిగే ఎడ్ల బలప్రదర్శన పోటీలను సైతం ప్రభుత్వ గుర్తింపు తెచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు చెప్పారు.

వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యం

- ఉమ్మడి జిల్లా వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి


చల్లా, కాటసాని కుటుంబాలతో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డి

అవుకు: వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా అంకిత భావంతో పని చేస్తామని ఉమ్మడి కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ రీజినల్ కో -ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం నంద్యాలలో శనివారం పోచా బ్రహ్మానందరెడ్డి కార్యాలయంలో కాటసాని, చల్లా కుటుంబాలతో రామసుబ్బారెడ్డి, ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానంద రెడ్డి భేటి అయ్యారు. రెండు కుటుంబాల పెద్దలు చర్చించి, గతంలో ఏవైనా చిన్న చిన్న పొరపాట్ల వలన సమస్యలు వచ్చి ఉంటే అలాంటి వాటిని పక్కన పెట్టి రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా ఇరు కుటుంబాలు కలిసి మెలసి ముందుకు సాగాలని సూచించారు. కాటసాని, చల్లా కుటుంబాలు ఇప్పటికీ, ఎప్పటికీ ఒక కుటుంబంగా భవిష్యత్ రాజకీయాల్లో ఉండాలన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి అయిన కాటసాని రామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి పోచాను అఖండ మెజారిటీతో గెలిపించటానికి చల్లా కుటుంబం కృషి చేస్తుందని చల్లా కుటుంబ సభ్యులు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చల్లా సూర్య ప్రకాశ్ రెడ్డి, ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి, ముఖ్య నాయకులు చల్లా విఘ్నేశ్వర్ రెడ్డి , అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, అవుకు ఉప సర్పంచ్ చల్లా రఘునాథ్ రెడ్డి, నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ముడియాల జయచంద్రారెడ్డి, నాయకులు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు హాజరయ్యారు.

విద్యుదాఘాతంతో జూనియర్ లైన్‌మ్యాన్ మృతి

- నెల రోజుల క్రితం తండ్రి మృత్యువాత


మృతి చెందిన మహేశ్వర ఆచారి

కోడుమూరు రూరల్ : విద్యుదాఘాతంతో జూనియర్ లైన్‌మ్యాన్ మహేశ్వర ఆచారి (32) శనివారం మృతిచెందాడు. పులకుర్తి గ్రామంలో ఓ రైతు పొలంలో కరెంట్ స్తంభం ఎక్కి ఫీజులు వేస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. కోడుమూరు మండలం క్రిష్ణాపురం గ్రామానికి చెందిన మహేశ్వర ఆచారి పులకుర్తిలో జూనియర్ లైన్‌మ్యాన్‌గా పనిచేస్తున్నాడు. విధి నిర్వహణలో భాగంగా శనివారం పులకుర్తిలోని ఓ రైతు పొలంలో ఫీజులు వేసేందుకు ఎల్‌సీ తీసుకుని కరెంట్ స్తంభం పైకెక్కాడు. అక్కడ ఒక ఫీజు వేసి, మరో ఫీజు వేస్తుండగా ప్రమాదశాత్తు కరెంట్ సరఫరా కావడంతో షాక్‌కు గురై స్తంభంపై నుంచి తలకిందులుగా పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పరిస్థితిని గమనించిన చుట్టుపక్కల వాళ్లు, రైతులు గాయపడ్డ మహేశ్వర ఆచారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందాడు. కాగా.. మృతుడి తండ్రి వడ్ల మల్లికార్జున కిడ్నీల సమస్యతో గత నెల 13న మృతిచెందగా, ఇంటి పెద్దదిక్కుగా ఉన్న మహేశ్వర ఆచారి కూడా ప్రమాదశాత్తు మృతి చెందడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. మహేశ్వర ఆచారికి రెండేళ్ల కిందటే వివాహం జరుగగా ఏడాది వయసున్న ఒక పాప ఉంది.

సంఘటనా స్థలం పరిశీలన

కర్నూలు(అగ్రికల్చర్): మహేశ్వర ఆచారి మృతి విషయం తెలుసుకున్న విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఎం .ఉమాపతి సంఘటనా స్థలానికి వెళ్లి విచారణ జరిపారు. విద్యుత్ షాక్‌కు గురైనట్లు ఆనవాళ్లు లేవని తెలిపారు. ఆదివారం కోడుమూరులో నిర్వహించే పోస్టుమార్టంలో అన్ని విషయాలు తెలుస్తాయని పేర్కొన్నారు.

రైలులో నుంచి జారి పడి వృద్ధుడు మృతి


మృతి చెందిన వృద్ధుడు గోకారి

బేతంచెర్ల: బుగ్గానిపల్లె తాండ – క్రిష్ణమ్మ కొన రైల్వే స్టేషన్ల మధ్యన ప్రమాదవశాత్తు రైలులో నుంచి ఓ వృద్ధుడు జారి కింద పడటంతో మృతి చెందాడు. జమ్ములమడుగుకు చెందిన గోకారి (70) డోన్ – నంద్యాల రైల్వే మార్గంలోని స్టేషన్ల భిక్షాటన చేస్తూ జీవించేవాడు. ఈ క్రమంలో శుక్రవారం గుంటూరు– కాచిగూడ రైలులో ప్రయాణిస్తూ ప్రమాదశాత్తు జారి పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బేతంచెర్ల ఆసుపత్రికి తరలించగా కోలుకోలేక శనివారం మృతి చెందినట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ ఖలీల్ తెలిపారు.

వీడిన సజీవ దహనం మిస్టరీ

- మృతుడు చెలిమిల్ల గ్రామానికి చెందిన శెట్టి ప్రతాప్‌గా నిర్ధారణ


మృతుడు శెట్టి ప్రతాప్(ఫైల్)


పూడ్చిన మృతదేహాన్ని వెలికి తీసిన దృశ్యం

పాములపాడు: నంద్యాల జిల్లా పాములపాడు మండల కేంద్రంలో ఈ నెల 1న జరిగిన సజీవదహనం మిస్టరీ వీడింది. మంటల్లో దహనమైన వ్యక్తి ఫారుక్ బాషాగా నమ్మించినా.. మృతుడు చెలిమిల్ల గ్రామానికి చెందిన శెట్టి ప్రతాప్‌గా నిర్ధారణ కావడంతో అడిషనల్ ఎస్పీ చంద్రబాబు రంగంలోకి దిగి నిపుణులైన వైద్యులచే శనివారం రీ పోస్టుమార్టం చేయించారు. వివరాల్లోకి వెళితే.. పాములపాడు మండల కేంద్రంలో ఈ నెల 1న ఏకే ట్రేడర్స్‌లో వ్యక్తి సజీవ దహనమైన ఘటన విధితమే. ఆ దుకాణం యజమాని ఫారుక్‌బాషాదే మృతదేహమని అందరూ అనుకున్నారు. అతని కుమారుడు అక్బర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించగా అంత్యక్రియలు నిర్వహించారు. కాగా చెలిమిల్ల గ్రామానికి చెందిన శెట్టి ప్రతాప్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు ఈ నెల 4న పోలీసు స్టేషన్‌లో అతని భార్య స్వరూప ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేసి మృతదేహం ప్రతాప్‌దేనని నిర్ధారించుకున్నారు. కాగా ఫారుక్‌బాషా.. ప్రతాప్‌ను హతమార్చి పెట్రోల్ పోసి నిప్పంటించినట్లు విచారణలో వెలుగులోకి వచ్చింది. దీంతో నంద్యాల అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, ఆత్మకూరు డీఎస్పీ శ్రీనివాసులు, ఆత్మకూరు రూరల్ సీఐ నాగభూషణ్, ఎస్ఐ అశోక్, ఇంచార్జి తహసీల్దార్ ఫటాన్‌బాబుల సమక్షంలో ముస్లిం శ్మశాన వాటికలో మృతదేహాన్ని వెలికి తీశారు. కుటుంబ సభ్యులకు చూపించారు. అక్కడే వైద్యులు అరుణ్‌కుమార్ రీ పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.